



# అడవి కళ్ళు

— జోర్ఘలశర్మ



**రెండు పక్కలా రాళ్ళు పేర్చిన గోడ, మరి రెండు వైపులా తడకల అడ్డు. ఆ మధ్య... చాటంత బల్లపరుపు బండపై భైరి. సత్తుముంతతో స్నానం చేస్తూ... మట్టితొట్టిలోని నిన్నటి నీళ్ళు ఆమె ఒంటిని కడుగుతున్నాయి....**

నీళ్ళు పోస్తున్న సత్తుముంత టక్కున ఆగిపోయింది. భైరి దృష్టి రాళ్ళగోడకున్న ఒక గంతపై పడింది. ఒక కన్ను అదేపనిగా తనకేసి చూస్తోంది. సత్తుముంతను ఎప్పటిలా తొట్టిలో నుంచి పైకితీయకుండా దోసిల్లో గుప్పెడు నీళ్ళు తీసుకుంది.

'ఓ(డా...ఆ సచ్చినోడు' గట్టిగా అరుస్తూ దోసిరి నీళ్ళను ఆ గంతకేసి విసిరికొట్టింది. కన్ను మాయమైంది. రాళ్ళగోడ అవతల పళ్ళికిలిస్తూ ఈరిగాడు.

'ఏం బుట్టిందిరా నీకు. తానం జేత్తూవుంటే సూత్తన్నావ్' ఈసడించుకుంటూ అంది భైరి. ఈరిగాడు అదేం పట్టించుకోకుండా చంకల్ని గోడపై ఆన్చి చేతుల్ని లోపలకు పెట్టి తదేకంగా భైరికేసి చూడసాగాడు. అసలే తెల్లచీర. అందులో జాకెట్ తీసేసి రొమ్ములు మీదగా లుంగీలా చుట్టుకుంది. దీనికితోడు సరిగ్గా కట్టుకుంటే మోకాళ్ళ కిందకే వచ్చే పొట్టిచీర. దాదాపు సగం తొడల్ని, సగం రొమ్ముల్ని మాత్రమే కప్పగలిగింది. నున్నని తెల్లని ఒంటి మీద నుంచి మెల్లగా జారిపడుతున్న నీటి చుక్కల్ని, తెల్ల తడిగుడ్డలో నుంచి బయటపడుతున్న ఒంటి పొంగుల్ని ఈరిగాడి కళ్ళు మింగేసేలా చూస్తున్నాయి.

'భైరీ...నువ్ శానా అందంగుంటవే...ఒక్క రూపాయిత్తనే... ఒక్కసారి...! ఇప్పుడీడ ఒక్క పురుగు కూడా లేదే' భైరి దృష్టి ఈరిగాడి చూపులపైనే వుంది. ఆ కళ్ళకే పళ్ళువుంటే అమాంతం ఆ ముఖాన్ని కొరికి పారేసేవి. ఈరిగాడు మరో అడుగు ముందుకేసి గోడ దూకి తడక తీసుకుని లోపల జొరబడ్డాడు. స్థాణువులా వున్న భైరి కుడిచెయ్యి తొట్టిలోని ముంతని వెతికి తీసుకుంది. ఇద్దరి మధ్యా జానెడే దూరం.....

'ఒలకు శెప్పనే భైరీ...నీ మొగుడి మీద ఒట్టు... నిమిషమ్లు గానిత్త...పోనీ రెండు రూపాయిలిత్తనే!' ఈరిగాడి ఎడమ చెయ్యి భైరి తడి నడుమును చుట్టింది. కుడి చెయ్యి గాల్లోకి లేచి నున్నని వెన్నుపై వాలబోయింది. 'అలా సూడకే...రావే...'ఈరిగాడి ముఖం భైరి రొమ్ములపైకొస్తోంది. సరిగ్గా అప్పుడే సత్తుముంత వాడి ముఖంపై రోకలిపోటు వేసింది.

'అబ్బా...' అన్న వాడి అరుపు....జివ్వుమన్న ముక్కు నరాల్లో కల్సిపోయింది. కన్నుమూసి తెరిచేంతలో భైరి తడక తీసి గుడిసెలో దూరి తలుపేసుకుంది. నడినెత్తి మీదకొస్తున్న సూర్యుడికిగానీ, చింతచెట్టు నీడన పడున్న ముసల్దానికిగానీ ఆ దృశ్యం కనిపించలేదు. ఆ సందడి వినిపించలేదు.

'గడుసు పోరీ...మల్ల దొరకవా పో' ఈరిగాడి రక్తం కసిగా మాసింది. కాళ్ళు గూడెం వైపు తిరిగాయి. భైరి కళ్ళల్లో నీళ్ళు. హృదయంలో ఆవేదనా సుళ్ళు. మనసులో పరిపరి విధాల ఆలోచనలు. పెళ్ళయిన ఏడాదికే ఇదేం కర్మో. ముదనష్టపోడు నా గండాన దాపురించిండు. అయినా తన మొగుడికి ఆడితో ఎందుకంత దోస్తీ. ఆడంటే పడిసత్తడేంటి? శివరకు ఆడే ఇట్టా సేత్తున్నాడని తెలిస్తే...అమ్మో ఈ విషయం మొగుడికి శెబ్తే ఇంకేమన్నా వుందా....లచ్చి... ఎంకి....సత్తమ్మ కళ్ళల్లో మెదిలారు. పరోడు బజార్లశెయ్యి పట్టుకున్నడనీ, పక్కింటాడ్తో చనువుగుంటుందనీ, ఎవడో ముద్దెట్టుకున్నడనీ ఇట్టాంటి విషయాలకే ఆళ్ళు మొగుళ్ళే నోళ్ళయ్యారు. ఊ అన్నా, ఆ అన్నా ఇడిషిపెడ్తామనే మొగుడ్లతో ఎట్టా వేగేదో. సంగతి తెలిస్తే తన మొగుడూ అట్టాగే సేత్తే బతుకు బుగ్గయిపోద్ది. భైరికి ఏడుపాగలేదు.

మొగుడి ముందే ఆ ఈరిగాడు చూసే చూపులు, చేసే శాతలు తల్చుకుంటేనే దుఃఖం పొర్లి వస్తోంది. ఆడి చనువు చూసి నవ్వి ఊర్కుంటడేగాని వద్దని శెప్పడే? ఆడి మీద ఇచ్వాసమా? అయినా మరీ గింత ఇల్లు గూల్చే విషయాన్ని గూడ్క పట్టించుకోకబోతే ఆడ్ని ఏం మొగుడనాల?' ఈ కొంపాకటి! మరీ గూడెం శివర్న పాడైంది. అరిశిగీ పెట్టినా ఒక్క పిట్ట పిల్ల అయినా రాదు. ఆ ముసలి అత్త వుంటే ఏం? కళ్ళు కనబడవు...చెవులు ఇనపడవ్.... మొగుడికి సద్దిగట్టి పంపిన కాడ్నుంచీ ఒక్కదాణ్ణే బితుకు బితుకుమనాల. పట్టపగలు గూడ్క దొంగ రాత్రిలా భయపడుతూ

గూకోవాల. ఇంగనన్నా దుర్గమ్మ తల్లే ఆదుకోవాల... భైరి ఆనాటినుంచి మొగుడుండగానే స్నానం చేస్తోంది. కాని ఆ రోజు పనిలోబడి భైరి స్నానం సంగతి మర్చింది. మొగుడు కూలికెళ్ళగానే స్నానం చేయ బోతూవుంటే ఈరిగాడు గుర్తుకొచ్చాడు. గుండె జడు సుకుంది. భయపడుతూనే గబగబా నీళ్ళు పోసుకుని పొడిచీర చుట్టుకుని గుడిసెలోకి వచ్చిపడింది. అప్పుడు గానీ ఆమె గుండె నిండా గాలిపీల్చుకోలేదు. చుట్టుకున్న చీర అంచుతో ముఖం తుడుచుకుంటూ దండెం మీద నుంచి జాకెట్ తీసుకుంటున్న భైరి ఒక్కమారుగా అదిరిపడింది. వెనక్కి తిరిగిన భైరికి ప్రాణం పైనే పోయినట్లు అయ్యింది. పళ్ళికిలిస్తూ ఈరిగాడు గుడిసెలో జొరబడి తలుపుపెట్టేశాడు. ఓరి దేవుడా ఇప్పుడేం జేసేది? అని హృదయం ఆందోళనతో పడిచస్తున్నా లేని ధైర్యాన్ని తెచ్చుకుంది.

'నీ సావుగాల...నీకేం బుట్టిందిరా నా యెంట పడ్డావ్' గట్టిగా అరుస్తూ పక్కనే పొయ్యి దగ్గర వున్న క్రొరాయి అందుకోబోయింది కానీ ఒక్క అంగలో ఈరిగాడ్షు దానికి అడ్డంచేరాడు.

'ఇయ్యాల విన్నొదిలేది లేదే...మంచిగ శెబ్తొన్నా ఇన్కా లేకపోతే నేను పశువునైపోతా' తడైనా ఆరని భైరి ఒంటిని కొరికేసేలా చూస్తూ దగ్గరికి రాసాగాడు. అడ్డదిడ్డంగా చుట్టుకున్న చీర జారిపోకుండా జాగ్రత్తలు పడుతూ వెనక్కి నడుస్తోంది తలుపుకేసి...భైరి కళ్ళల్లో భయం... గుండెలో వణుకు. అకస్మాత్తుగా కాళ్ళకు తగిలిన కొడవలిని చటుక్కున అందుకుంది భైరి. ఎక్కడలేని ధైర్యం వచ్చింది.

'ఇగ రారా...ఒక్క దెబ్బకు కసక్కున నరికిపారేస్తా నీ యవ్వా'

'నీ చేతిలో సచ్చినా సరేనే...విన్ను ఇయ్యాల వదల' ఏమాత్రం భయపడకుండా వాడు భైరిని సమీపిస్తున్నాడు. కొడవలెత్తి పట్టుకునే భైరి తలుపు వైపు వెనక్కు అడుగులేస్తోంది. టక్కున అదను దొరికింది. చురుగ్గా అమాంతం వెళ్ళి కొడవలి పట్టుకున్న చేతి మణికట్టును దొరకపుచ్చుకున్నాడు. పెనుగులాట... కదలికకు ఒదులుగా వున్న కొంగు కాస్తా భుజం మీద నుంచి జారిపోయింది. దానితో తడైనా పూర్తిగా ఆరని రొమ్ములు బయటపడేసరికి భైరి వెంటనే కొడవల్ని నేలకు వదిలి కొంగు సవరించుకోబోయింది. కాని వాడి రెండు చేతులూ ఆమె రెండు చేతుల్ని వెనక్కి విరిచి పట్టుకున్నాయి కదలకుండా. నగ్నంగా వున్న అర్ధశరీరం వాడిని పశువును చేసింది. కుడి చేతితో నేలపైకి జారిన కొంగు అంచును పట్టి గట్టిగా గుంజాడు. అంతే కన్నుమూసి తెరిచేంతలో ఆరు గజాల చీర సాంతం వుండలా కాళ్ళ మీదకు జారిపడింది. అప్పుడే...ఒక్క మెరుపు మెరిసేంతలో నూలుపోగైనాలేని ఆ నగ్న దేహాన్ని ఆ ఆడవి కళ్ళు చూసీచూడనంతలో...భైరి వున్న బలాన్నంతా కూడగట్టుకుని వెనగ్గా జానెడు దూరంలోనే వున్న తుప్పపట్టిన తలుపుల్ని రెండు కాళ్ళతో ఎగిరి వెనక నుంచి గట్టిగా తన్నింది. అంతే... జర్రున నేలకు విరుచుకుపడ్డ భైరి ముఖం, తల ఈరిగాడి పొట్టని ఢీకొట్టడం...పెళ్ళుమన్న శబ్దంతో తలుపులుకాస్తా సగానికి విరిగిపడడం అరసెకనులో జరిగిపోయాయి. ఒక్కమారుగా వచ్చిన తోపుకు ఈరిగాడి చేతుల్లో నుంచి భైరి చేతులు ఊడి బయటపడడంతో నుదురుచిట్లి రక్తం కారుతున్న ముఖంతోనే జెట్‌లా పైకిలేచి రాకెట్‌లా బయటకు దూసుకుపోయింది. అదిరిపడ్డ ఈరిగాడు తేరుకుని బయటకు వచ్చేలోగానే చింతచెట్టు కింద మూలుగుతున్న ముసల్ది కప్పుకున్న దుప్పటిని లాగి ఒంటికి చుట్టుకుని గూడెం వైపు ఒక్కమారుగా పరుగులంకించుకుంది భైరి...ఈ హఠాత్తు పరిణామానికి స్తంభించిపోయిన వాడి గుండె ఆ దృశ్యాన్ని అలా శిలువులా చూస్తూవుండిపోయింది. భైరి ఏడుస్తోంది. వెక్కి వెక్కి ఏడుస్తోంది. గుండె పగిలేలా ఏడుస్తోంది. చూస్తువ్వంతలోనే గూడెమంతా గుప్పుమన్న సంగతి. కాసేపట్లో వచ్చే మొగుడికి తెలియబోదు. వస్తూనే వాలుగుతన్ని అవ్వతాడికి బోయే అని ఇడిశిపెట్టకపోడు. 'మొగుడొదిలేసింది' అన్న రాబోయే పేరును తలచుకుంటేనే భైరికి దుఃఖం ఆగడంలేదు. ఆడిశేత తన్నుల్దిని పోయేకన్నా ఇప్పుడే ఎల్లిపోవడంమేలు. భైరి మూటాముల్లెతో గుడిసె గడపదాటింది. రాళ్ళ గోడ దగ్గర టక్కున ఆగిపోయింది. ఎదురుగా ఎర్రబడ్డ కళ్ళతో మొగుడు. కాని చిత్రం...కొడతాడను కున్న అతని చేతులు భైరిని అక్కున చేర్చుకున్నాయి.

'నన్ను శెమించే భైరీ...ఇన్నాళ్ళు విన్ను అడవిదాన్ని జేసి వదిలిపోయినందుకు ఇప్పుడు బుద్ధి వచ్చిందే' భైరి తన చెవుల్ని తనే నమ్మలేకపోయింది.

'ఆ ముండాకొడుకు పెళ్ళాన్ని నడిబజాంట్లో బట్టలిప్పి ఆడించకపోతే ఈడు నీ మొగుడుకాదే!' అప్పుడు తెలిసింది భైరికి...ఇంకా మొగుడి కళ్ళు ఎందుకు నిప్పులు చెరుగుతున్నాయో.

'ఒద్దు మామా...నీకు శాతనైతే ఆడ బట్టలూడదీసి బుద్ధిశెప్పుగానీ ఇంకో ఆడదానికి ఇట్టాంటి అవమానం చెయొద్దు''

'భైరీ....'

'నిజం...మావా...ఇట్టాంటి తప్పు మళ్ళీ శెయ్యకుండా ఆడికి బుద్ధి చెప్పాలంటే ఆడికిదే తగిన శిచ్చ' అతని కళ్ళు తృప్తిగా చూశాయి. ఆ ఉన్నత మనస్తత్వం ముందు అతని హృదయం వంగి సలాం చేసింది. అప్పుడు అడవిలో చిక్కుకుపోయిన భైరి మనస్సు హాయిగా, ఆనందంగా ఆకాశంలోకి ఎగిరింది. ●



## 'సీ' రియల్ లేఖ

మొట్ట మొదటిసారి మా లేఖలు వ్రాయడం మీ (మా) ఉదయం వీక్లీతోనే ప్రారంభం. ఉదయంలో విరచితమవుతున్న 'చీకట్లో సూర్యుడు', 'భైరవనాదం', 'విశ్వ చైతన్యం' లాంటి సెన్సేషనల్ సీరియల్స్ మాకు ప్రేరణ. సీరియల్స్ గురించి మా అభిప్రాయాన్ని తెలియజేస్తూ మీకు అభినందనలు తెలిపిన ఉత్తరం అది. ఆ ఉత్తరం శ్రీదేవి ముఖచిత్రంతో విడుదలైన 'ఉదయం' పత్రికలో ప్రచురితమైంది. ఇలా మా మొదటి ఉత్తరం అచ్చులో చూసుకుని మాకెంతో ఆనందాన్ని కలుగజేసింది.

జి.వసుంధర
మద్దిపాడు



## వరకట్నంపై .....

నాలో దాగివున్న భావాలను పదిమందికీ తెలపాలని నా అభిలాష. అందుకు వార్తాపత్రికలు ఒక సాధనం. నేను మొట్టమొదటిసారిగా 'కలువబాల' పక్షపత్రికకు ఒక లేఖ రాశాను. ఆ ఉత్తరానికి ఇరవై రూపాయల బహుమతి లభించింది. ఆ లేఖలోని విషయం 'వరకట్న సమస్య'. నేను ఆ ఉత్తరం రాయడానికి గల ప్రేరణ మనదేశంలో ప్రతిరోజు ఎంతోమంది అబలలు ఈ వరకట్న సమస్యకు ఆహుతి కావడమే. నేను పంపిన లేఖ 1–15 మే పత్రికలో అచ్చుఅయినది. నా లేఖను ఆ పత్రికలో చూసిన తరువాత నా ఆనందం వర్ణించరానిది.

ఎ.సీతారామలక్ష్మి
తేలప్రోలు